యుద్ధ కథానిక:

# ఆరని మంటలు

కె. యాదవ రెడ్డి

శ్రీనగర్ నుండి ఆర్డర్సు రాగానే మా పటాలం వెనక్కి బయలుదేరింది. దాదాపు 20 రోజుల వరకు లద్దాక్ సరిహద్దును కాపాడుతునే వున్నాం. ఆకసాయిచిన్ రోడ్డుగుండా వచ్చిన చైనావాళ్ళ లాంగ్ రేంజి ఆర్టిలరీ ముందు నిలుచోలేక పోయ్యాం. వెనక్కి వెళ్ళిపోయి చుజుల్ విమాన స్థావరాన్ని ఏ రకంగానైనా రక్షించే బాధ్యత మాపై వేయబడింది. హెడ్ క్వార్టర్సు నుండి వచ్చిన ఆజ్ఞ దేవుడి ఆజ్ఞ. దాన్ని ధిక్కరించడానికి వీల్లేదు.

వారం రోజులనుండి మా కాళ్ళు బూట్లల్లోనే అంటుక పోయాయి. గడ్డం పెరిగింది. బట్టలన్నీ తేమగా వున్నాయి. మా వీపులపై కిట్ బ్యాగ్‌ను మోస్తూ మంచుపై నడుస్తూ జాగ్రత్తగా వెళ్ళిపోతున్నాం. మా స్థావరాన్ని విడిచి వెనక్కి వెళ్ళమనగానే మా మేజరు బలబీర్ సింగ్ ముఖం అనంగీకారాన్ని సూచించింది. అయినా తప్పలేదు వెనక్కి వెళ్ళడం. ఈ స్థావరం కంటే ముఖ్యం చుజల్ విమాన స్థావరం. అది ఆ ఎర్రచైనా సైనికులకు చేజిక్కితే పంజాబ్ సర్వనాశనమే అని మాకు తెలుసు.

మా ముందు మేజర్ బలబీర్ సింగ్ దారితీస్తూ నిర్భయంగా వెళ్ళుతున్నారు. యాభై సిపాహీలం అనుసరిస్తున్నాం.

ఎక్కడచూసినా ఆకాశాన్నంటే పర్వత పంక్తులు. మబ్బులు కొండ శిఖరాలు కలసి ముచ్చటిస్తున్నాయి. తెల్లదనం యావత్తు ఈ ప్రాంతంలోనే గడ్డకట్టుక పోయిందేమో ననిపించింది. ఎటు కను తిప్పినా తెల్లటి పరిసరాలు. మా ముఖాపైనుండి చల్లనిగాలి దూసుక పోతూ ఏవో జ్ఞాకాలని రేపుతోంది. నా వెనక ముందూ స్నేహితులంతా ఎవరి అనుభూతులను వారు నెమరు వేయడములో తేలిపోతున్నారు.

నేను బేసిక్ ట్రైనింగ్‌లో వున్నప్పుడు ఈ మిలిటరీ జీవితం దుర్భరమనిపించేది. అస్తమానం పెరేడ్‌లో ఉస్తాద్ క్రమశిక్షణ మా వూపిరిని తీసేసేది. కాళ్ళు పైకిలేపి భూమిపై బాదేవరకు తలలోని మెదడు కదలిపోయేది అప్పుడే అనుకుంటాను ఆ మెదడులోని నీరంతా మరిగిపోయి భయాన్ని ఏ కోశానా లేకుండా చేసిందేమోనని.

రోజు రోజంతా 20 మైళ్ళ దాకా రూట్ మార్చి చేస్తూ పోవడం మరచిపోలేని అనుభవం. దాహం వేసినా, కాళ్ళు నొప్పి పుట్టినా నోరు మెదిపే సాహసం అయ్యేది కాదు. ఆ ప్లాటూన్‌లో అందరితో సమానంగా నడిచి పోతూవుంటే ఏదో కొత్త శక్తి ప్రవేశించి శరీరాన్ని యావత్తూ యంత్రంగా మార్చేసేది. నిజం! మనిషి యంత్రంగా మారిపోవడం ఎంత ఆశ్చర్యం.

అలాంటి శిక్షణ ప్రస్తుతం ఇలాంటి అనూహ్యమైన పరిసరాల్లో నిర్భయంగా జీవించేట్టు చేయగలిగింది. అందువల్లే అప్పుడు కలిగిన బాధ— అలసట, అప్పుడన్నీ ఒక పరమార్థాన్ని సూచిస్తున్నాయి.

మా నడక సాగిపోతూనే వుంది. మా అందరి ముఖాలు దాదాపు ఒకేలా అనిపిస్తున్నాయి. ఆ యూనిఫారమ్—పెరిగిన గడ్డాలు, జ్యోతుల్లా వెలుగుతున్న కళ్ళు, మా పోలికలు అన్నీ-ఒక సర్దార్జీ మిత్రులు తప్ప.

సాయంత్రం అయిదు కావొస్తుంది. మంచు కురవడం మొదలవుతున్న సమయం. ఇంకా చీకటి పడలేదు. నడుస్తూనే వున్నాం. మా మేజర్ ఎక్కడ విశ్రమించాలో పురమాయించలేదు.

భయంకరంగా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. కొండలు-చెట్లు అన్నీ మా కోసం అలానే నిలుచున్నాయి.

కాసేపు అలానే నడక సాగిస్తున్నాం. అకస్మాత్తుగా కొండ ప్రక్క నుండి తుపాకి ప్రేలింది. వెంటనే మేము భూమిపై కూర్చుండిపోయాం

(తరువాయి 14 వ పేజీ)

## ఆరని మంటలు

(7 వ పేజీ తరువాయి)

మరోవైపునుండి మిషన్ గన్ వరుసగా గుండ్లు ప్రేల్చివేస్తోంది మేము మా ఆటోమాటిక్ రైఫిల్సు తో ఎదురు దెబ్బతీస్తూనే వున్నాం.

మంచు కప్పుకొన్న భూమిని కరచుకొని ప్రాకుతూ కొంత దూరం సాగాం. మరోవైపునుండి గ్రెనేడ్ వచ్చి పడింది. మరోటి... మరోటి.. ఇలా హ్యాండ్ గ్రెనేడ్స్ పగలగానే విరజిమ్మిన పొగలో మేమంతా చెల్లాచెదరై పోయాం.

నేను పరుగెత్తి ఒక్క ఊపులో ఒక చెట్టుపైకి చేరుకున్నాను. రైఫిల్ తో కాల్పులు సాగిస్తూనే వున్నాను. భూమంతా దద్దరిల్లిపోతోంది. కొండలన్నీ ప్రతిధ్వనిస్తున్నాయి. మా వెనుకాలే తెలుసుకొని వచ్చేస్తున్నారు చైనావాళ్ళు.

నా రైఫిల్ పనిచేయడం మానేసింది. హడావిడిగా జేబులన్నీ వెదుక్కున్నాను. బుల్లెట్లు అయిపోయినాయి. ఏమి చేయాలి. గుండె కొట్టుకోవడం ప్రారంభించింది.

కొమ్మకి అతుక్కొని క్రిందికి చూస్తూ వుండిపోయాను. ఎదురుగా దూరంలో ఒకతను లేస్తూ పడుతూ వస్తున్నాడు. గుర్తించాను– మా మేజర్‌ను_ కాలుకి దెబ్బ తగిలింది. అయినా ప్రయత్నం మానలేదు. మా సైనికులెవరు చుట్టుపక్కల కనపడడం లేదు. మేజర్ ప్రమాద స్థితిలో వున్నాడు. నేనేమో అసహాయుణ్ణిగా చూస్తూ వుండిపోయాను.

ఒక్కసారే నలువైపుల నుండి చైనా సైనికులు రైఫిల్స్‌తో చుట్టుముట్టేశారు. "హాల్ట్" అనగానే మేజర్ "హాండ్సప్" చేశాడు, అతని చేతిలో రైఫిల్ నగైరాలన్నీ లాగుకొని చేతులు కట్టివేశారు.

కొంతసేపు చైనా దళనాయకుడు ఏవో వివరాలు అడిగాడు. మేజర్ తలత్రిప్పడం కనిపించింది. అతని చెంపపై ఆ అధికారి దెబ్బతీసాడు. నా గుండెలో బైనెట్‌తో పొడిచినంత బాధవేసింది. మళ్ళీ జేబులు వెదికాను. ప్రయోజనం లేకపోయినది. ఇంతగా ఏమిచేయలేని స్థితిలో వుండడం నరకయాతనగా అనిపించింది. చైనాదళాధికారి తన పిస్టల్‌ను తీసుకొన్నాడు. మేజర్ బలబీర్ సింగ్‌కిదగ్గరగా తీసుకొచ్చిపాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ప్రేల్చేసాడు. ఎంత అమానుషం——ఎంత రాక్షసంగా చంపేశాడు కిరాతకుడు ... కింద కూలిపోయిన మేజర్‌ను అలానే వదిలేసి చైనాదళం వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

అరగంట గడిచిపోయింది నిశ్శబ్దంగా. మరి కాసేపు ఆ స్థితిలోనే వున్నాము. "జై హింద్" అన్న చప్పుడు వినపడింది. నేను ప్రతిజవాబుగా "జై హింద్" అన్నాను. తోటి వాళ్ళంతాఒక్కొక్కరే చేరుకొన్నారు. మాలో చాలామందికి గాయాలు తగిలాయి. అందరి దగ్గర మందుగుండు సామాగ్రి అయిపోయింది. ఇలాంటి దురదృష్టకర పరిస్థితిని మాకు భగవంతుడు ఎందుకు కల్పించాడో అర్థం కాలేదు. ఇలాంటి స్థితిలో చిక్కుకొని మా నాయకుని దక్కించుకోలేక పోయాం.

మా మనస్సులు మంచులా గడ్డ కట్టుక పోయాయి. మేజర్ సహాబ్ రక్తాన్ని తుడిచేశాను. నేను మరిద్దరం నిర్జీవ ఆకారాన్ని ఎత్తుకున్నాం. భారంగా ఏం మాట్లాడకుండా నడక ప్రారంభించాము.

రాత్రి పది గంటలకు ఒక చిన్న గ్రామం చేరుకొన్నాం. అక్కడ మేజర్ శవ దహనానికి ఏర్పాట్లు చేశాము శవాన్ని మంటల్లో చూసే వరకు కన్నీళ్ళు ఆపుకోలేక పోయాం. గబగబా పైకిలేస్తున్న మంటలు మా కన్నీళ్ళలో ప్రతిఫలించాయి. భగభగ మండి మా ధైర్యాన్ని ఆరిపోకుండా ప్రతీకారం కోసం కృతనిశ్చయులను చేశాయి.

మరుసటి రోజు సాయంత్రం సర్దార్ జోరావర్ సింగ్ శిథిలాలను చేరుకున్నాం. అక్కడే మా క్యాంపు అంతకు పూర్వమే మరో యూనిట్ అక్కడ వుంది. జోరావర్ సింగ్ కోట శిథిలమైనది... పదమూడు వేల

అడుగుల ఎత్తున పర్వత ప్రాంతంలో వుంది. ఆ ఎత్తైన ప్రాంతంలో చలి ఎముకల్ని కొరికేస్తోంది. మా రిపోర్టు ఇచ్చినతర్వాత బ్రిగేడియర్ మమ్మల్ని పిలిపించి సానుభూతిగా మాట్లాడారు. మాకు ధైర్యాన్ని చెబుతూ మేజర్ ను చంపిన వాళ్లపై ప్రతీకారాన్ని తీసుకొనేందుకు అన్ని వేళలా సిద్ధంగా వుండాలని చెప్పారు.

ఆ కొండపై మా డ్యూటీ నిరాటకంగా కొన్ని రోజులు సాగింది. చుజుల్ విమానస్థావరానికి పదిహేను మైళ్ళ దూరంలో వున్న ఈ కొండ దగ్గరికి ఆ ఏర్ పోర్ట్ దీపాలు రాత్రి స్పష్టంగా కనిపించేవి.

మా ట్రెంచ్ లల్లో తుపాకి నంటి పెట్టుకొని బైనాక్యులర్స్ తో ఎప్పుడూ చూస్తూ వుండడం మా పని. దూరదూరంగా లోయల్లో ముంపాలనబడే బౌద్ధ విహారాలు కనబడుతుండేవి. చుట్టూ లోయ ప్రాంతం. మేము వున్న కొండకు దిగువగా లోయలో చిన్న నది ప్రవహిస్తూ వుంది. ఆ నదికి మరో వైపు సన్నగా చీలి దారి ఏర్పడివుంది.

అలాగే పది రోజులు గడిచిపోయాయి. చైనావాళ్ళదాడి మళ్ళీ జరగలేదు. చెదరుగా మా కంటే ముందు వున్న స్థావరాలనుండి కాల్పులు వినబడుతుండేవి.

ఒకరోజు నేను మా జమేదార్ నాయర్ ట్రెంచిలో కూర్చొని వుండగా ఏదో మాటల సందర్భంలో దేశం ప్రసక్తి వచ్చింది. నాయర్ అంటాడు ''ఈ భూమి తత్వాన్ని పంచుకొని పుట్టిన మనం ఈ మట్టి కోసం ఎందుకు ప్రాణాలు ఇవ్వాలి? అందులో భారతదేశంలాంటి అందాల భూమిని రక్షించుకోవడం కేవలం మట్టికోసమేనా?"

నేను నా ఈ ఆరేళ్ళ మిలట్రీ సర్వీసులో హవల్దార్ గా పనిచేస్తూ ఈ ప్రశ్ననే చాలా సార్లు తర్కించుకొన్నాను. నాయర్ అలా ప్రశ్నించగానే జవాబిచ్చాను– ఒక మహాకవి 'దేశమంటేమనుష్యులోయ్'. ఈ దేశమంటే ఒక మనుష్యులేమిటి–మట్టి కాదా? అని కొందరు వాదిస్తారు. అందులో పండితుల మహాశయులు దేశమంటే మట్టేనని ఖండితంగా వాదిస్తారు."

వెంటనే నాయర్ అన్నాడు – "వాళ్ళు మహాశయులు అలానా అంటారు. ఏదో ఉబలాటం తప్ప నాకనిపిస్తుంది–ఈమనుష్యులని మినహాయిస్తే దేశం ఎలా అవుతుంది! ఈ దేశం మట్టి అన్నమాట కాదనలేక పోయినా దాన్ని ఆక్రమించుకొని మన ప్రజా స్వామ్యాన్ని బలియిస్తారని భయంతోనేకదా మనుష్యుల కోసం పోరాడుతున్నాం".

"నిజమే నాయర్ సహాబ్, ఆ మనుష్యులో మేజర్ బలబీర్ సింగ్ స్థానాన్ని మనం ఎలా మరచిపోతాం. నా కెప్పుడు మనచుట్టూ వున్న కొండలు మండిపోతున్నట్లు– అందులోని మంటలు మేజర్ జ్ఞాపకాన్ని ఆరిపోకుండా చూస్తుంటాయి." అని మనస్సులోని మాట చెప్పాను.

నా ప్రక్కనే కూర్చున్న జమేదార్ బైనాక్యులర్స్ తో చూస్తున్న వాడల్లా ఏకాగ్రతగా చూడడం మొదలు పెట్టాడు. మోచేత్తో నన్ను తట్టగానే నా చేయి రైఫిల్ పైకి వెళ్ళింది.

నేను కూడా బైనాక్యులర్స్ తో పరీక్షించి చూసాను. మేము కొండ దిగువ నది గట్టుపైన వున్నాం. నదికి అటు ప్రక్కనుండి సన్నగా చీలినదారి గుండా ప్రాకుతూ కొన్ని ఆకారాలు వస్తున్నాయి. మేము పసిగట్టేసాం.

జమేదార్ మెషిన్ గన్ సిద్ధం చేసాడు. నేను రైఫిల్ ని గురిచూసి తయారుగా వున్నాను. ఇంతలోగానే ఇంత దగ్గిరిగా శత్రువులు వస్తారని ఊహించుకోలేక పోయాం. ఈ అవకాశాన్ని చేజారనివ్వొద్దని ఆ మంటలు మా రక్తంలోకి ఉరికాయి. నది అటువైపునుండి ఒక్కొక్కటి నీళ్ళల్లోకి ఉరికాయి. నడుస్తూ వస్తున్నారు రైఫిల్స్ పైకెత్తి పట్టుకొని, ఇంకా దగ్గిరగా రానిచ్చాం. మెషిన్ గన్ ఒకే మోతతో కాల్చేస్తోంది. నా రైఫిల్ లోని గుండ్లు ముగిసేదాక ఫైరింగు సాగించాను. దిష్టి బొమ్మల్లా ఆ ఆకారాలన్నీ కూలిపోయాయి.

ఇరవై కి పైగా వున్న అంతమంది మావలయంలో చిక్కుకొని అంత సునాయాసంగా దొరికిపోవడం ఆశ్చర్యం వేసింది. యుద్ధంలో ఏమి జరిగినా నిర్వీర పోవలసిన అవసరం వుండదని ఇలాంటి సంఘటనలు ఎన్నో నేర్పించాయి.

అరగంట గడిచాక అటువైపు కొండపైనుండి మన జెండా ఊపుతున్నారు.

(ఆకాశవాణి హైదరాబాద్ సౌజన్యంతో)